క్లుప్తంగా

'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన వైద్యం



రోగులకు చికిత్సలు అందిస్తున్న వైద్యురాలు

కుందుర్పి: గ్రామీణులకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమతో మెరుగైన సేవలు అందుతున్నాయని వైద్యాధికారిణి చాంద్‌బేగం అన్నారు. శనివారం మండలంలోని వెంకటంపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి 120 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మహేశ్వరి, లైలా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వాహన కాలుష్యాన్ని తగ్గిద్దాం



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ విశ్వనాథ్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: లైఫ్ మిషన్ కార్యక్రమంలో భాగంగా వాహన కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాయదుర్గం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని వినాయక సర్కిల్‌లో స్థానిక ట్రాఫిక్ పోలీసులతో కలసి ఆటోడ్రైవర్లతోపాటు వివిధ రకాల వాహన డ్రైవర్లకు వాహన కాలుష్య నివారణపై అవగాహన కల్పించారు. వాహనాలను కండీషన్‌లో పెట్టుకుంటే కాలుష్య నియంత్రణ సాధ్యపడుతుందన్నారు. డ్రైవర్లకు ఖచ్చితంగా వాహనానికి పొల్యూషన్ టెస్టు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి 20 సెంట్ల స్థలం అప్పగింత



మాట్లాడుతున్న వార్డు సభ్యులు

ఉరవకొండ: ఉరవకొండ పంచాయతీ పరిధిలోని సర్వే నెం 560–ఎ–2 ఎల్‌పీ నెం 5–04లోని ఉరవకొండ చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి విక్రయ సంఘం లిమిటెడ్ వారికి మంజూరు చేసిన 40 సెంట్ల స్థలంలో తిరిగి 20 సెంట్లు పంచాయతీకి అప్పగించడాన్ని మెజార్టీ సభ్యులు ఆమోదం తెలిపారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మీనుగ లలితమ్మ అధ్యక్షతన అత్యవసర పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈఓ గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ 28 మార్చి 2006లో ఉరవకొండకు చెందిన చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి విక్రయ సంఘానికి పంచాయతీ పబ్లిక్ పర్పస్ స్థలం 40 సెంట్లును అప్పటి పాలకవర్గం తీర్మానించి కేటాయించిందన్నారు. 40 సెంట్ల స్థలంలో ప్రస్తుతం 20 సెంట్ల స్థలాన్ని తిరిగి పంచాయతీ అప్పగిస్తూ చేనేత సంఘం అర్జీ ఇచ్చిందన్నారు. అర్జీ మేరకు సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్పతో పాటు మెజార్టీ వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి



జగనన్న కాలనీలో ఇళ్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ నిశాంత్ రెడ్డి, హౌసింగ్ అధికారులు

కళ్యాణదుర్గం/కూడేరు/గుమ్మఘట్ట: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు త్వరగా ఇళ్లను పూర్తి చేసుకోవాలని ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి సూచించారు. స్థానిక ముదిగల్లు లేఅవుట్‌లోని జగనన్న కాలనీలో శనివారం స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీ ప్రసన్న, హౌసింగ్ డీఈఈ శైలజ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, ఏఈ రామ్మోహన్‌లతో కలిసి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులతో సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే మండలంలోని హులికల్లు, మల్లికార్జునపల్లి జగనన్న లే అవుట్‌లో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీ ప్రసన్న, డీఈఈ శైలజ, ఏఈ రామ్మోహన్, ఆర్‌ఐ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ, నాయకులు రామచంద్ర, సురేష్ పరిశీలించారు. కూడేరు మండలంలోని ముద్దలాపురంలో అధికారులు హౌసింగ్ డే నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సక్సెనా, ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా, సర్పంచ్ ధనుంజయ్య, వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, హౌసింగ్ ఏఈ శేఖర్ పాల్గొన్నారు. అలాగే గుమ్మఘట్ట మండలంలోని కలుగోడు గ్రామ సచివాలయంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. తహసీల్దార్ వేణుగోపాల్, సర్పంచ్ కవిత, హౌసింగ్ ఏఈ జమీల్‌అహ్మద్ , పంచాయతీ కార్యదర్శి శ్వేతపద్మిని, జెడ్పీ మాజీ సభ్యుడు వన్నప్ప పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం

- గడప గడపలో మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



శెట్టూరు: లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్



బొమ్మనహాళ్: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

శెట్టూరు/కంబదూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని సంక్షేమ పథకాలు పొందుదామని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. శనివారం శెట్టూరు మండల కేంద్రంలో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు. ముందుగా మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ టి.తిమ్మరాజమ్మ, ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు మంజునాథ, సచివాలయాల కన్వీనర్ తీన్మార్ తిమ్మరాజు, మండల కన్వీనర్ శివన్న, మాజీ కన్వీనర్ సోమనాథరెడ్డితో కలిసి గ్రామంలో వాల్మీకి, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. జగనన్నకు ఓటు వేస్తే అమ్మ ఒడి, ఆసరా, చేయూత, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన, నేతన్న నేస్తం తదితర సంక్షేమ పథకాలు వస్తాయన్నారు. చంద్రబాబుకు ఓటు వేస్తే సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ, ఇంటి వద్దకే పెన్షన్, ఇంటి వద్దకే రేషన్ పంపిణీ నిలిచిపోతాయన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, నాయకులు హరినాథరెడ్డి, బొమ్మజ్జి రమేష్, రామకృష్ణ, సుధాకర్, టైలర్ వన్నూరుస్వామి, రామాంజనేయులు, వీరభద్ర, బలిస్వామి, రంగనాథ, రాజశేఖర్ రెడ్డి, అధికారులు ఫణికుమార్, గంగావతి, రాధమ్మ, వేణుకార్తికేయ, సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ యువరాజ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

- కంబదూరు మండలంలోని మేళ్లకుంట, రాళ్లపల్లి గ్రామాల్లో మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని మంత్రి అంకెల సహా ప్రజలకు వివరించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు , పచ్చ మీడియా తప్పుడు ఆరోపణలు చేస్తూ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు గోవిందు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామోహన్, సచివాలయాల మండల కన్వీనర్ సాకే గంగాధర్,సర్పంచులు శివ, లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ తిమ్మారెడ్డి, ఎంపీటీసీ మల్లేష్, నాయకులు కదిదేవపల్లి హనుమంతరాయుడు, పాల్లూరు కిష్ట, రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో సుస్థిరస్థానం

బొమ్మనహాళ్: సంక్షేమ పాలనతో పేదల హృదయాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం సంపాదించుకున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దర్గాహొన్నూరు–2 గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. విప్ ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. పథకాల ద్వారా పొందిన ప్రయోజనాన్ని వివరించి బుక్‌లెట్ అందజేశారు. విప్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక ప్రభుత్వంపై బురద జల్లుతున్నారన్నారు. నారా లోకేష్ యువగళం పేరిట చేస్తున్న పాదయాత్ర ద్వారా ప్రజలు కష్టాలు తీరుస్తాననడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. గతంలో చంద్రబాబు 600 హామీలను ప్రకటించి, అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచారని, మా నాయకుడు జగనన్న ముఖ్యమంత్రి అయిన వెంటనే ఇచ్చిన హామీలను 95 శాతం నెరవేర్చారన్నారు. రాజధానిలో ప్రతి పేదవాడికీ ఇంటి స్థలం కేటాయించడం ఎంతో శుభపరిణామమన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షాల నాయకులు వందమంది కలిసి వచ్చినా సీఎం జగన్ ఒక్కరే ఎదుర్కొంటారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2 లక్షల కోట్లు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజల ఆశీస్సులతో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ప్రజల హర్షధ్వానాల మధ్య అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు నాగరత్నమ్మ, రమేష్, సర్పంచ్ శంకుతలమ్మ, ఎంపీటీసీ రామకృష్ణ, కోఆప్షన్ మెంబర్ మాబుసాబ్, నాయకులు వన్నల్లి రామాంజనేయులు, మనోహర్‌శెట్టి, ఆనంద్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, నుంకేష్, బడిగే వన్నూరుస్వామి, జలేందర్, కోటేశ్వరరెడ్డి, వన్నూరుస్వామి, సురేష్‌స్వామి, వీరన్నగౌడ్, చెన్నరాయుడు, దివాకర్, యల్లప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

కళ్యాణదుర్గం: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు శనివారం మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. ఉదయం 10 గంటలకు కళ్యాణదుర్గం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల కౌన్సిలర్లు, ఆర్‌పీలతో మంత్రి సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కళ్యాణదుర్గం, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు, బ్రహ్మసముద్రం మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కంబదూరు: మండలంలోని గొల్లపల్లి, చెర్లోపల్లిలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు మంత్రి ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

బైకు ర్యాలీ రేపు

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని శాంతినగర్ వైఎస్సార్ విగ్రహం నుంచి రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వరకూ ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పట్టణ కన్వీనర్ ముస్తాక్ శనివారం తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

ఆలయానికి నిధులు మంజూరు చేయించండి



ఎమ్మెల్సీ శివరామిరెడ్డిని సత్కరించిన దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని ఎస్‌ఎస్‌పీ తండా గ్రామంలో సుంకులమ్మ దేవాలయ నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించాలని గ్రామస్తులు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని కోరారు. శనివారం మండలంలోని కొనకొండ్ల గ్రామంలో ఎమ్మెల్సీని ఎస్‌ఎస్‌పీతండాకు చెందిన సుంక్యానాయక్, రామ్లానాయక్, ఆర్.గోవిందునాయక్, రూప్లానాయక్, వి.గోవిందునాయక్, రోగ్యానాయక్ తదితరులు కలిసి వినతిపత్రం అందచేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్సీని శాలువా, పూలమాలతో సత్కరించారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో సుంకులమ్మ ఆలయ నిర్మాణానికి సు మారు రూ.30 లక్షలు దాకా ఖర్చయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారు కోరారు. ఇందుకు ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు.

పరామర్శ

విడపనకల్లు: మండలంలోని మాళాపురం గ్రామానికి చెందిన వలంటీర్ ఓబుళేసును ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శనివారం పరామర్శించారు. ఓబుళేసు నంద్యాలలో ఆరోగ్యశ్రీ కింద గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మాళాపురం గ్రామానికి వెళ్లి వలంటీర్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, గోపి, కేశన్న, రవి, గురు స్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు



కార్యకర్తలతో కలసి పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత శ్రీచరణ్

బ్రహ్మసముద్రం: వైఎస్సార్‌సీపీ కి కార్యకర్తలే పట్టుగొమ్మలని ఆ పార్టీ నాయకుడు, మంత్రి ఉషశ్రీచరణ్ భర్త శ్రీచరణ్ అన్నారు. శనివారం మండలంలోని ఎస్ కొండాపురం, పాలవెంకటాపురం, ఎరడికెర, వెస్ట్ కోడిపల్లి, భైరవానితిప్ప, గుండిగానిపల్లి, వేపులపర్తి పంచాయతీల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. కార్యకర్తల సమస్యలను తెలుసుకుంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఇది చూసి ఓర్చుకోలేక ప్రతిపక్ష నాయకులు బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, వారి కుయుక్తులను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, ఎంపీపీ చంద్రశేఖరరెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు, వీరశైవ లింగాయత్ డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి, ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్‌రెడ్డి, శెట్టూరు జెడ్పీటీసీ సభ్యుడు మంజునాథ, మున్సిపల్ వైస్‌చైర్మన్ జయం ఫణి, శెట్టూరు మండల కన్వీనర్ శివన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

డి హీరేహాళ్(రాయదుర్గం): ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే పెళ్లి చేయాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి సూచించారు. శనివారం డి హీరేహాళ్ మండల పరిషత్ కార్యాలయంలో సీడీపీఓ ప్రభావతి, ఐసీడీఎస్ స్టాండింగ్ కమిటీ మెంబర్, జెడ్పీటీసీ హసీనాబాను, ఎంపీడీఓ భాస్కర్‌బాబు, తహసీల్దార్ ఈశ్వర్‌రెడ్డి, సూపర్‌వైజర్ నాగరత్నతో కలసి ఆమె బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్య నేరమన్నారు. అలా చేసిన వారు బాల్య వివాహాల నిషేధిత చట్టం 2006 ప్రకారం జైలుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. తమ శాఖ ఆధ్వర్యంలో ఈ ఐదేళ్లలో ఒక్క డి హీరేహాళ్ లోనే 19 వివాహాలు అడ్డుకున్నామన్నారు. బాలికల చదువుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. బాల్య వివాహాలకు అడ్డుకట్టు పడాలంటే ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో రాయదుర్గం సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, డీటీ బసవకుమార్, ఎస్‌ఐ రంగడుయాదవ్ లు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: చిన్న వయసుకే పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ వనజ అక్కమ్మ హెచ్చరించారు. శనివారం మండలకేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం బాల్యవివాహాలు కరికట్టడానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలకిషన్, ఏఓ నందకిశోర్, ఎంఈఓ ఓబుళపతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది, అంగన్ వాడీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సంక్షేమ సేవకులు వలంటీర్లు

- 'వలంటీర్లకు వందనం'లో ప్రభుత్వ విప్ కాపు



ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డితో సన్మానం పొందిన వలంటీర్లు

రాయదుర్గం రూరల్: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుల ఇంటిముంగిటకే అందిస్తున్న సంక్షేమ సేవకులు వలంటీర్లు అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కొనియాడారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ కొండయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, డీఎల్‌డీఓ శంకర్‌తో కలసి విప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విప్ మాట్లాడుతూ దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించే ప్రణాళిక రూపొందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, మంచం నుంచి కదలలేని వారికి వలంటీర్లు సేవలందించడం ఆదర్శనీయమన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను దేశ, విదేశాల మేధావులే ప్రశంసిస్తుంటే 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే తుప్పునాయుడు విషం వెళ్లగక్కుతున్నాడన్నారు. అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తామని , తిరిగి పందికొక్కుల్లా మెక్కిన జన్మభూమి కమిటీలను తెస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గంలో కూడా ఓ మురికి కాలవ ఉందని , ఆ నోరు మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్ కన్నా కంపు అన్నారు. వచ్చే ఎన్నికల్లో మరొక్కమారు ఆ మురికి కాలవకు ప్రజలే బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. అనంతరం సేవా వజ్ర పురస్కారానికి ఎంపికైన కె.సునీత(మల్లాపురం), కె.సుధాకర్(జుంజురాంపల్లి), సేవా రత్న పురస్కారానికి ఎంపికైన బి.శిల్ప(74 ఉడేగోళం), యు.నిర్మల(వేపరాల), ఎం.ఫణీంద్ర(మల్లాపురం), పి.మహేష్(జుంజురాంపల్లి), ఎస్. మల్లికార్జున(డి.కొండాపురం)కు ఆయన శాలువా కప్పి , మెడల్స్, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. సేవా మిత్ర పురస్కారం పొందిన వలంటీర్లను ఆయా సచివాలయల పరిధిలో సన్మానించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు, నాయకులు మల్లికార్జున, శివారెడ్డి, పీఆర్ జేఈ మునెప్ప, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ గదుల వేలం వాయిదా

రాయదుర్గంటౌన్: సమగ్ర చిన్న, మధ్య తరహా పట్టణాభివృద్ధి పథకం కింద మున్సిపల్ కూరగాయల షాపింగ్ కాంప్లెక్స్ పైఅంతస్తులో నిర్మించిన గదుల అద్దెకు శనివారం నిర్వహించిన వేలం వాయిదా పడింది. గుడ్‌విల్ ప్రాతిపదికన గదుల వేలానికి పాటదారులు ఒక్కరూ కూడా ఆసక్తి చూపలేదు. దీంతో ఈ నెల 8వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి ప్రకటించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మల్లేశు (ఫైల్)

కంబదూరు: మండలంలోని కదిరిదేవరపల్లికి చెందిన హరిజన మల్లేశు (35)న శనివారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మల్లేశు జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడు. ఇంటికి నీటిని పెట్టేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య సాలమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరుగుదొడ్డి స్థలం దురాక్రమణ

బెళుగుప్ప: మండల కేంద్రంలోని శీర్పి రోడ్డులో గ్రామ శివారున నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన సామూహిక మహిళల మరుగుదొడ్డి స్థలాన్ని ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో ఓ వ్యాపారి జేసీబీతో శనివారం కూల్చి వేయించాడు. విషయం తెలుసుకున్న మహిళలు గ్రామస్తులతో కలసి ఆందోళన చేపట్టారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మరుగుదొడ్డిని మళ్లీ నిర్మిస్తానని వ్యాపారి పేర్కొనడంతో మహిళలు శాంతించారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి



క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేస్తున్న జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌కుమార్‌రెడ్డి

వజ్రకరూరు: క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శని వారం మండల కేంద్రంలో కొనకొండ్ల గ్రామానికి చెందిన క్రీడాకారులకు క్రికెట్ కిట్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రణయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో క్రికెట్ కిట్లు అందజేశామన్నారు. క్రీడల్లో పట్టుసాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, చదువుతోపాటు క్రీడల్లోనూ ఉన్నతలక్ష్యాలు అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్, ఎంపీపీ రమావత్‌దేవి, వైస్ ఎంపీపీలు సుశీలారాణి, సుంకమ్మ, ఎంపీటీసీ ఫిరోజ్‌భాను, సర్పంచులు మోనాలిసా, మల్లెల జగదీష్, కొనకొండ్ల నాయకులు దాసరి గోవిందు, సంజప్ప, హరి, చైతన్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ

బొమ్మనహాళ్: గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ యు. పద్మ సూచించారు. శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా రూ. 42 కోట్ల నిధుల మంజూరుకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రత్యేక కృషి చేశారనన్నారు. వివిధ దశల్లో ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ను సెప్టెంబర్ నెల చివరిలోగా పూర్తి చేయాలన్నారు. ఉదయం 10 గంటలకు సమావేశం ఉందని తెలిసినా.. అధిక శాతం మంది 12 గంటల వరకూ సమావేశానికి హాజరు కాకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను ఆయా సచివాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమం దృష్టికి తీసుకుస్తే పరిష్కరిస్తామన్నారు. దర్గాహొన్నూరు గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీలకు తాగునీటి సమస్య ఉందని ఓహెచ్ఆర్ ట్యాంకును ఏర్పాటు చేయాలని సర్పంచ్ శంకుతలమ్మ, ఎంపీటీసీ శ్రీదేవి కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షకీలాబేగం, వైస్ ఎంపీపీలు రమేష్, నాగరత్నమ్మ, కోఆప్షన్ మెంబర్ మాబుసాబ్, పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి, ఎంఈఓ తిమ్మప్ప, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విత్తన వేరుశనగ పంపిణీ రేపు

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం రైతు భరోసా కేంద్రంలో ఈనెల 29న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి చేతుల మీదుగా సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయాధికారి మహేంద్ర శనివారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు పంపిణీ కార్యక్రమం ఉంటుందని, ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

విడపనకల్లు: ఆర్‌బీకేల్లో సోమవారం విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఏఓ పెన్నయ్య శనివారం తెలిపారు. ఇదివరకే ఆర్‌బీకే రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు వేరుశనగ పంపిణీ చేస్తామన్నారు.

ఎరువులు, విత్తనాల కొనుగోలులో జాగ్రత్త వహించాలి

కుందుర్పి: విత్తనాలు, ఎరువుల కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్త వహించాలని వ్యవసాయ అధికారి మహేష్ సూచించారు. శనివారం స్థానిక ఆర్‌బీకేలో రైతులు ప్రైవేటు దుకాణాల్లో విత్తన కొనుగోలుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద లేదా అనుమతి పొందిన కంపెనీల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే విధిగా బిల్లు పొందాలన్నారు. ఎంఆర్‌పీకి మించి విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

బొమ్మనహాళ్: కేఎస్ ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొని బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామానికి చెందిన పూజారి రమేష్ (22) మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ.. తాను అందుబాటులో లేకపోవడంతో దహన సంస్కారాలకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ పరమేశ్వర, కేపీఆర్ యూత్ సభ్యులు రాముడు, జగన్, అంజి, ధను, అనీల్ తదితరులు మృతుడి తండ్రి వైస్ సర్పంచ్ పూజారి తిమ్మప్పకు నగదు అందజేశారు.

సజావుగా 'ప్రజావేదిక'

గుమ్మఘట్ట: ఎంజీఎన్ఆర్ సీఎస్‌లో రూ.3,777 అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీలో బయటపడినట్లు డ్వామా అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గత 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి ఆఖరు వరకూ జరిగిన 713 పనులపై సామాజిక తనిఖీబృందం వారం రోజులుగా తనిఖీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి పర్వాజ్, ఎంపీడీఓ శ్రీనివాసులు, స్టేట్ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్‌నాయక్, ఏపీఓ సురేశ్, ఏఈ లక్ష్మీనారాయణ, సర్పంచ్ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, డీఆర్పీలు, టీఏలు, ఎఫ్ఏలు, ప్రజలు పాల్గొన్నారు.

పశు బీమా పథకానికి రిజిస్ట్రేషన్ చేసుకోండి

కూడేరు: పశు బీమా పథకానికి పాడి రైతులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకందారులు సమీప రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల పశువైద్యాధికారి శ్రీనివాసులు శనివారం సూచించారు. రేషన్‌కార్డు కల్గిన ఎస్సీ, ఎస్టీ పాడి రైతులకు బీమా ప్రీమియం చెల్లింపులో 80 శాతం రాయితీ ఉంటుందన్నారు. అందులో నాటీ పశువులకు రూ.30 వేలు బీమాకు ప్రీమియం రూ.384, రూ.15 వేలు బీమాకి ప్రీమియం రూ.192 చెల్లించాల్సి ఉంటుందన్నారు. గొర్రెలు, మేకలు, పందులకైతే రూ.6 వేలు బీమాకి ఏడాదికి రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్లకైతే రూ.75 చొప్పున ప్రీమయం చెల్లించాలన్నారు.